

విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల రీజినల్ కో- ఆర్డినేటర్ పీఎస్. కల్యాణి

గిరిజన గురుకుల కళాశాలలో సైన్స్‌ఫేర్

హయత్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రీజినల్ స్థాయి ఇగ్నైట్ ఫెస్ట్‌లో భాగంగా బుధవారం హయత్‌నగర్‌లోని గిరిజన గురుకుల కళాశాలలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లాలోని 17 కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైన్స్‌ఫేర్, యూత్ పార్లమెంట్ క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గురుకుల కార్యదర్శి నవీన్ నికోలస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల రీజినల్ కో- ఆర్డినేటర్ పీఎస్. కల్యాణి, ప్రిన్సిపల్ ఎం.యాదగిరి, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి పడిపూజలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అయ్యప్ప పూజలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి, అబ్దుల్లాపూర్, ఇనాంగూడ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన అయ్యప్ప స్వాముల ఇరుముడిధారణ, పూజ కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి అనుగ్రహం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కవాడిపల్లిలో మాజీ సర్పంచ్ ఇరుగు చిత్తారి, జాపాల కిట్టు యాదవ్, బొడిగె కొండల్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, దూసరి యాదయ్యగౌడ్, కొత్త ప్రభాకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, రాసాల రాముయాదవ్, నర్సింహయాదవ్, రాజుగౌడ్, రవియాదవ్, రమేష్‌గౌడ్, బాబుయాదవ్, కొండల్‌రెడ్డి కొలన్ పాల్గొన్నారు.



ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో కార్మికులతో గ్రేటర్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు, డీఎం హరి, తదితరులు

ఆర్టీసీ కార్మికుల వన భోజనాలు

చాదర్‌ఘాట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో కార్మికులు బుధవారం ఆందోళ్ మైసమ్మ ఆలయ ఆవరణలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపో మేనేజర్ హరి, ముఖ్యఅతిథిగా గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. కార్మికులు అంకితభావంతో విధులు నిర్వహించి ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలని వెంకటేశ్వర్లు కోరారు. హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సుచరిత, జగన్, డిపో వెల్ఫేర్ కమిటీ సభ్యులు జీఎస్ఆర్, మోహన్, సాజు, లలిత, జి.అశోక్ పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న చుక్కల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ వేణుకుమార్‌చుక్కల, భగవాన్

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన పలువురు నేతలు

చంపాపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును బుధవారం చంపాపేటకు చెందిన శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నదాన ట్రస్ట్ చైర్మన్ భగవాన్, చుక్కల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ వేణుకుమార్ చుక్కల కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, చరణ్, చందు ఉన్నారు.

బీసీ మహిళా సమాఖ్య గ్రేటర్ అధ్యక్షురాలిగా పాల్వాయి శ్రీనిధి

చంపాపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ మహిళా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలిగా చంపాపేట డివిజన్ రెడ్డిబస్తీకి చెందిన పాల్వాయి శ్రీనిధి నాయిబ్రాహ్మణ నియమితులయ్యారు. బీసీ మహిళా సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి చేతుల మీదుగా బుధవారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనిధి... భాగ్యలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల హక్కుల సాధన కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడతానని పేర్కొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న పాల్వాయి శ్రీనిధి నాయిబ్రాహ్మణ



చైతన్యపురిలోని బీజేపీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు రామోజు షణ్ముఖ చారి కుటుంబ సభ్యులను బుధవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

- (దిల్‌సుఖ్‌నగర్,ఆంధ్రజ్యోతి)

అంధుల ఆరాధ్య దైవం లూయీ బ్రెయిలి

● నేడు మలక్‌పేటలో జయంతి వేడుకలు



మలక్‌పేటలో ఏర్పాటుచేసిన అధునాతన కంప్యూటర్ ప్రింటింగ్ మిషన్

మలక్‌పేట జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అంధుల ఆరాధ్యదైవం లూయీబ్రెయిలి. అంధుల కోసం లిపి కనుగొని వారి జీవితాల్లో వెలుగునింపిన మహనీయుడు. చూపులేని వారి కోసం ఆరు చుక్కలతో లిపిని కనుగొని అంధుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు పారిస్‌లో జన్మించిన ఆయన నాలుగో ఏట ఓ ప్రమాదంలో రెండు కళ్లను కోల్పోయారు. చూపు కోల్పోవడంతో చదువులో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు 17వ ఏట అంధులకు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి కనుగొన్నాడు. చూపులేని వారి జీవితాల్లో వెలుగునింపినందున అంధులు ఆయన జన్మదినాన్ని జనవరి 4న ఘనంగా జరుపుకుంటారు

పరిష్కారానికి నోచుకోని సమస్యలు...

రాష్ట్రంలో సుమారు 1,99,977 వేల మంది అంధులు ఉన్నట్లు సమాచారం. ఇందులో పుట్టుకతో కొందరు, ప్రమాదాల్లో మరికొందరు చూపు కోల్పోయారు. వీరికి ప్రభుత్వం నుంచి కొన్ని పథకాలు అందుతున్నా కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. పదేళ్లుగా వికలాంగుల బ్యాక్‌లాక్ ఉద్యోగ నియామకాలు లేవు. ఉద్యోగాల్లో ప్రమోషన్లు కల్పించాలని, అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, అవసరమైన ఉపకరణాలు అందించాలని అంధులు కోరుతున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అంధుల రాకపోకలకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.

మలక్‌పేటలో బ్రెయిలి ప్రింటింగ్

మలక్‌పేటలో బ్రెయిలి లిపి ప్రింటింగ్ మిషన్ ఉంది. వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో అధునాతన కంప్యూటర్ ప్రింటింగ్ విధానం అందుబాటులో ఉంది. 1986లో ఇక్కడ బ్రెయిలి ప్రింటింగ్ మిషన్ నెలకొల్పారు అంధ విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు ఇక్కడే ముద్రిస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 10 వేల మంది విద్యార్థులున్నారు.

నేడు వేడుకలు

లూయీబ్రెయిలి జయంతి వేడుకలను గురువారం మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో జరుపుతున్నారు సంబంధిత శాఖ మంత్రి సీతక్క హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు వికలాంగులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం : సర్వే సత్యనారాయణ



సింగరేణి కాలనీలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



సావిత్రిబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

మన్సూరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళలకు చదువు అవసరమని భావించి ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పి ఎంతోమందికి విద్య నేర్పిన సావిత్రిబాయి పూలే నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ పేర్కొన్నారు. ఓబీసీ పీపుల్స్ పీపుల్స్ ఫెడరేషన్, పూలే యువజన సంఘం ప్రతినిధులు శనిగరపు స్వామి, మేడిగ శ్రీధర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం మన్సూరాబాద్ సహారా రోడ్డులో నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, ముద్దగోని లక్ష్మీప్రసన్న, ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, ఎస్సీ సెల్ ఎల్‌బీనగర్ చైర్మన్ జోగు రాములు, విశ్వకర్మ సంఘం జాతీయ నాయకులు కౌలె జగన్నాథం, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు చామకూర రాజు హాజరై.. సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంజాల జైహింద్‌గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ కె.వి.గౌడ్, ముద్దగోని జగన్‌మోహన్‌గౌడ్, బీఎస్పీ ఎల్‌బీనగర్ అధ్యక్షుడు గువ్వల సాయిరాంకృష్ణముదిరాజ్, సావిత్రి,ఉపేంద్ర యాదవ్, కదిరె కృష్ణ, వాసుయాదవ్, మిద్దెల మల్లేష్ డాక్టర్ అశోక్, పాల్వాయి వేణు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌లో..

తెలంగాణ గాడ్గే రజక సంఘం అధ్యక్షుడు పెద్దపూరె బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫేలే జయంతి వేడుకలను నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీలో నిర్వహించారు. కృష్ణవేణి పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. విద్యార్థులకు మాస్కులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పలత, నాయకులు నాగిళ్ల యాదగిరి, వెంకటేష్, జూపల్లి రామకృష్ణ, రవి, పున్నం రాములు, రత్నమ్మ, దివ్య భారతి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

జింకలబావి కాలనీలో..

ఎల్‌బీనగర్ : సరూర్‌నగర్ డివిజన్ జింకలబావి కాలనీలోని సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద జయంతి ఉత్సవాలు నిర్వహించారు. తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్, బీసీ సంఘాల నేతలు ఆకుల అరవింద్‌కుమార్, టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, బబ్బూరి ఆనంద్‌గౌడ్, కబీర్‌దాస్, యాంద్ర లోకేష్, కల్పన, సిలివేరు వెంకట్‌గౌడ్, రాకేష్ నివాళులర్పించారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ గడ్డం బాలకిషన్‌గౌడ్, భాగ్యమ్మ, స్వాతి రమేష్, నవీన్‌కుమార్, సుధాకర్, ధనుష్ పాల్గొన్నారు.

సింగరేణికాలనీలో...

సైదాబాద్ : సింగరేణి కాలనీలో సీపీఐ ఐఎస్ సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు కమతం యాదగిరి, శంకర్ నాయక్, రాజునాయక్, అంజయ్య, సక్రీబాయి, అమీనా, దశరథ నాయక్, పాండు పాల్గొన్నారు.



కొత్తపేటలోని ఓ బంకు వద్ద పెట్రోల్ కోసం క్యూలో ఉన్న వాహనదారులు

రెండో రోజూ పెట్రోల్ బంకుల్లో అదే దుస్థితి

ఎల్‌బీనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లోని చాలా పెట్రోల్ బంకులు స్టాక్ లేకపోవడంతో బుధవారం కూడా మూసి ఉన్నాయి. కొన్ని బంకుల్లో అందుబాటులో ఉండడంతో పెట్రోల్ పోయించుకునేందుకు వాహనదారులు బారులు తీరారు. కొందరు వాహనదారులు పరిచయమున్న వారి ద్వారా అదనంగా బాటిళ్లలో పెట్రోల్ పోయించుకుని తీసుకెళ్లారు. రాత్రికి కొన్ని బంకులకు పెట్రోల్, డీజిల్ రావడంతో తెరిచారు.



ఆర్టీసీ సిబ్బందికి వినతిపత్రం సమర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి : ఏబీవీపీ

చాదర్‌ఘాట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతూ ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ జిల్లా కన్వీనర్ కుంచాల సాయిరాం బృందం బుధవారం దిల్‌సుఖ్‌నగర్ డిపో సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సాయిరాం ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ జిల్లా కార్యదర్శి అభిషేక్, కార్యవర్గసభ్యులు హనుమాన్, కీర్తన్, కల్యాణ్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

'రోడ్డుకు అడ్డుగా ఉన్న ర్యాంపులు తొలగించాలి'

హయత్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి బుధవారం హయత్‌నగర్ పరిధిలోని పవనగిరి కాలనీ, సిగిహిల్స్ కాలనీల్లో పర్యటించి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సిరిహిల్స్ కాలనీ అధ్యక్షుడు రాగెటి రాజిరెడ్డి, బడుగు హరినాథ్, సంపత్‌గౌడ్, కర్ణాకర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, కడారి యాదగిరి యాదవ్, రోహిత్‌రెడ్డి, పారంద సాయి పాల్గొన్నారు.

'వీధి దీపాల మరమ్మతు చేపట్టండి'

కొత్తపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో వీధిదీపాల మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ ఈఈ పున్నా నాయక్‌ను కోరారు. బుధవారం ఆయన ఈఈ కార్యాలయానికి వెళ్లారు. కాలనీల్లో తరచూ వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. సమస్య తీవ్రంగా ఉన్న కాలనీల సమాచారాన్ని ఈఈకి అందజేశారు. కార్యాలయం వద్ద వీధి దీపాల మరమ్మతులు, నియంత్రణలు చూసే కార్మికులు నిరసన చేపట్టడంతో ఆయన వారికి మద్దతు తెలిపారు. కార్పొరేటర్ వెంట నాయకులు వెంకట్‌రెడ్డి, మోహన్‌రావు, శ్రీకాంత్ ఉన్నారు.



వీధి దీపాల మరమ్మతుల సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఏఏఐ ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ షురూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆలిండియా ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ప్రారంభించారు. ఈ నెల 7 వరకు జరగనున్న ఈ టోర్నీలో ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. బుధవారం సికింద్రాబాద్‌లోని ఏఓసీ క్రికెట్ మైదానంలో నార్త్ జోన్ వర్సెస్ సెంట్రల్ జోన్ మ్యాచ్‌ను టాస్ వేసి, జగన్ ప్రారంభించారు. దీనికి ముందు ఆయన మాట్లాడుతూ అత్యంత ఒత్తిడితో కూడిన ఉద్యోగం చేస్తూ సరదాగా కాకుండా క్రికెట్‌ను ఇంత ప్రొఫెషనల్‌గా ఆడుతుండడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ఉప్పల్ స్టేడియం నెట్స్‌లో మీరంతా ప్రాక్టీస్ చేస్తుంటే చూశానని, క్రికెట్‌పై మీకున్న అంకితభావం చూస్తుంటే ముచ్చట వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఏఏఐ ఈడీ ఎస్. స్వామినాథన్, ఏఏఐ ట్రేడ్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు ఎస్ఆర్ సంతానం పాల్గొన్నారు.



క్రికెటర్లతో కరచాలనం చేస్తున్న జగన్



మాస్టర్ గేమ్స్ టీషర్ట్స్ ఆవిష్కరిస్తున్న ఆ సంఘం ప్రతినిధులు

6న మాస్టర్ గేమ్స్ చాంపియన్‌షిప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర మాస్టర్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 6వ తేదీన సికింద్రాబాద్‌లోని జింఖానా స్టేడియంలో నిర్వహించనున్నారు. బుధవారం మాస్టర్స్ గేమ్స్ సంఘం ప్రతినిధులు వై.రామారావు, భాస్కర్‌రావు ఈ పోటీల టీషర్ట్స్‌ను ఆవిష్కరించారు. 100, 200, 400 మీటర్ల పరుగు పోటీలు, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రోలో పురుషులు, మహిళలకు విడివిడిగా పోటీలు నిర్వహించనున్నారు.



జువెనైల్ శాఖ అధికారులతో ట్రైనీ జిల్లా జడ్జిలు

జువెనైల్ హోంలను సందర్శించిన ట్రైనీ జిల్లా జడ్జిలు

సైదాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర గృహం, ప్రత్యేక బాలుర గృహాలను (జువెనైల్ హోమ్‌లు) బుధవారం శిక్షణ పొందుతున్న 12 మంది జిల్లా జడ్జిలు సందర్శించారు. జువెనైల్ హోంలో చిన్నారులకు అందుతున్న సదుపాయాలు, ప్రత్యేక బాలుర గృహంలో ఉన్న బాలలపై కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించారు.

హోంల నిర్వహణపై ఎన్‌హెచ్ఆర్‌సీ ప్రశంసలు

జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి సైదాబాద్‌లోని జువెనైల్ హోంలను సందర్శించారు. వాటి నిర్వహణను పరిశీలించి ప్రశంసించారు. వీధి బాలలు, బాలకార్మికులు, అనాథలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, స్వయం ఉపాధి శిక్షణ, భోజన, వసతి సౌకర్యాలను ఆమెకు జువెనైల్ శాఖ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బేగ్ వివరించారు. హోం సూపరింటెండెంట్లు నాగేశ్వర్ రావు, అఫ్జల్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జీహెచ్ఎంసీ ఎస్‌డబ్ల్యుఎం డిప్యూటీ కమిషనర్ సువార్త

పారిశుధ్య కార్మికులకు సన్మానం

చంపాపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం చౌరస్తాలో బుధవారం జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ పారిశుధ్య కార్మికులతో కలిసి జీహెచ్ఎంసీ ఎస్‌డబ్ల్యుఎం డిప్యూటీ కమిషనర్ సువార్త కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అజీమొద్దీన్, శానిటరీ జవాన్ శంకర్, ఎస్ఎఫ్ఏలు శ్రీనయ్య, హన్మంతు, అలీ, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.



శ్రీరాముని అక్షింతలు ఊరేగిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహయాదవ్, తదితరులు

శ్రీరాముని అక్షింతలు పంపిణీ

వనస్థలిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముని అక్షింతలను భక్తిశ్రద్ధలతో స్వీకరించాలని కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు, శ్రీకృష్ణనగర్ కాలనీ అధ్యక్షులు కుట్ల నర్సింహయాదవ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్ కాలనీలో శ్రీరాముని అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కాలనీవాసులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజయ్య, వెంకటేష్, ఉపేందర్ రెడ్డి, యాదగిరిరావు, కైలాస్, లింగం యాదవ్, సత్యం పాల్గొన్నారు.

హయత్‌నగర్: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర కార్యక్రమంలో భాగంగా తుర్కయంజాల్‌కు తీసుకువచ్చి అక్షింతలను బుధవారం కమ్మగూడలోని శ్రీసత్యనారాయణ స్వామి ఆలయానికి తరలించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ కౌశిక ఐలయ్య, కౌన్సిలర్ సునీల్ అక్షింతలను ర్యాలీగా ఆలయానికి తీసుకువచ్చారు. పలు కాలనీల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సరూర్‌నగర్ : అయోధ్య రాములోరి అక్షతలను ఇంటింటికీ పంపిణీ చేసే ప్రక్రియలో భాగంగా బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో అయోధ్య రామమందిరం తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షతల ఊరేగింపు నిర్వహించారు. బాలాపూర్‌లోని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి నివాసానికి ట్రస్ట్ ప్రతినిధులు వెళ్లి అక్షతలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా రాజగోపుర శిఖర ప్రతిష్ఠ మహోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయ రాజగోపుర శిఖర, కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కెంపిన మఠాధిపతి చెన్న బసవప్రభు మహా స్వామి చేతుల మీదుగా రాజగోపుర శిఖర ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర వీరస్వామిగౌడ్, మాజీ ఎంపీ డాక్టర్. బూర నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, జ్ఞానేశ్వర్‌గౌడ్, వినోద్, ఐలయ్య, ప్రవీణ్, సతీష్ పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ

వనస్థలిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న క్రిస్మస్ కానుకలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంప్ చర్చిలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై నర్సింగ్ రాథోడ్, డాక్టర్ కె.సుదర్శన్ రావు, క్రిస్మస్ కమిటీ అధ్యక్షులు టీ.ఎస్.బాబు రావు, కార్యదర్శి ఎన్.జాన్, ఎం.సురేష్ కుమార్, మిట్టా రామ్మోహన్, ఎంబీ రాజు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జైలు

రంగారెడ్డి కోర్టులు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా రెండో అదనపు జడ్జి తీర్పుచెప్పారు. ఇబ్రహీంపట్నానికి చెందిన ముత్యాల సుదర్శన్, బాల్మీకి నవీన్‌కుమార్ ఎస్ఎల్ఎన్ మద్యం దుకాణం వద్ద గొడవపడ్డారు. నవీన్... సుదర్శన్‌ను కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. సుదర్శన్ సోదరుడు ముత్యాల రమేష్ ఫిర్యాదుతో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో ఛార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితుడికి శిక్ష విధించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చంపాపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంబర్‌పేటకు చెందిన కొమురయ్య (38) మంగళవారం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి డీఎంఆర్ఎల్ చౌరస్తా నుంచి చాంద్రాయణగుట్ట వైపు వెళుతూ ఫిసల్‌బండ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.